## క్లుప్తంగా

### ఘనంగా అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్సవం

పామర్రు: స్థానిక శ్రీ వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్సవం త్రయాహ్నిక దీక్షలో మంగళవారం రెండో రోజు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సుశీల దంపతులు పీటలపై కూర్చుని కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. బుధవారం గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### బాడీ బిల్డింగ్ పోటీల్లో గుడివాడకు బంగారు పతకం



గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలో బంగారు పతకం సాధించిన ఎస్.దిలీప్‌ను మంగళవారం నిర్వహించిన సమావేశంలో పలువురు అభినందించారు. కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ కానూరులో ఈనెల 11న జరిగిన బాడీ బిల్డింగ్ అండ్ ఫిజికల్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో గుడివాడ క్రీడాకారుడు దిలీప్ బంగారు పతకం సాధించారు. గుడివాడకు చెందిన ఫిట్ జోన్ బిల్డర్స్ క్రీడాకారుడు ఎస్.దిలీప్ 70 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. దిలీప్‌ను కోచ్ మహ్మద్ సైదా, డాక్టర్ మాగంటి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మలిరెడ్డి రవి, ఫిట్ జోన్ సభ్యులు అభినందించినవారిలో ఉన్నారు.

### రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కు సత్కారం



గుడివాడ టౌన్: స్థానిక 11వ వార్డులోని జీవన్ పబ్లిక్ స్కూల్‌లో కేటీఆర్ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ దండమూడి జయలక్ష్మిని క్లబ్ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. తారక రామా వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కె.రామకృష్ణ, ఘంటసాల రామకృష్ణ, సామి రామ్మోహనరావు, దండమూడి సీతారామస్వామి, దాసరి సురేష్, పి.నాంచారయ్య, కె.ప్రసాద్, ఎం.బ్రహ్మయ్య, వి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్. కుమారి మంగళవారం పరిశీలించారు. త్వరలో నిర్వహించనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఇతర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఎన్నికలు సజావుగా సక్రమంగా సాగేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎంపీడీవో ఎస్.ఎం.గంగాధరరావు, ఎస్ఐ వెంకట్‌కుమార్ ఉన్నారు.

### తప్పుడు కథనాలను ప్రజలు పట్టించుకోరు

–వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నారాయణ రెడ్డి

గుడివాడ టౌన్: గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ప్రభుత్వాన్ని ప్రజలు మర్చిపోరని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంపీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా ఈ ఎల్లో మీడియా తప్పుడు కథనాలను ప్రచురిస్తూనే ఉందన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో సంక్షేమ ఫలాలు చేరాయన్నారు. జరుగుతున్న అభివృద్ధి ప్రజల ముందుకు తీసుకు వెళ్లకపోయినా పర్వాలేదు గాని తప్పుడు సమాచారాన్ని ఇవ్వడం పత్రికా రంగానికి సరికాదన్నారు. కరోనా కష్టకాలంలో కూడా ప్రజలను ప్రభుత్వం ఆదుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని అన్నారు.

### కైకలూరు టౌన్ ఎస్సైగా రాజు

కైకలూరు: టౌన్ ఎస్సైగా ఎంఆర్‌కే.రాజు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను ఆయన నివాసం వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అల్లూరు సీతారామరాజు జిల్లా రంపచోడవరం పోలీసు స్టేషన్ నుంచి కైకలూరుకు వచ్చారు.

### శ్యామలాంబకు ప్రత్యేక పూజలు

కైకలూరు: మాఘమాస నవరాత్రుల్లో భాగంగా కై కలూరు శ్యామలాంబ తల్లి హసంతి శ్యామలాదేవీగా భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. చుక్కా రామకృష్ణ దంపతులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో వీఎన్‌కే.శేఖర్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గుర్రం రాంబాబు పర్యవేక్షించారు.

# పేదలపై కనికరం లేని క్రూరుడు చంద్రబాబు

- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని
- దొండపాడులో రూ.1.43 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం
- ఎమ్మెల్యే నానికి ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు, గ్రామస్తులు



వాటర్‌ట్యాంక్‌ను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొడాలి నాని, ప్రజాప్రతినిధులు

గుడివాడరూరల్: పేద ప్రజలపై కనీస మానవత్వం లేని క్రూరుడు మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) దుయ్యబట్టారు. మండలంలోని మోటూరు గ్రామంలో రూ.1.43 లక్షలతో నిర్మించిన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్, పంప్‌హౌస్‌లను మంగళవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. తొలుత గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. రహదారి వెంబడి ప్రతి ఒక్కరికి అభివాదం చేసుకుంటూ ఎమ్మెల్యే కొడాలి నాని తాగునీటి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం వద్దకు చేరుకున్నారు. ముందుగా దొండపాడు గ్రామ శివారులో రూ.47.75లక్షలతో తాగునీటిని శుద్ధి చేసే పంప్ హౌస్‌ను గుడివాడ మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్, ఎంపీపీ గద్దె పుష్పరాణి, సర్పంచ్ చోరగుడి సురేఖలతో కలిసి ఎమ్మెల్యే కొడాలి నాని ప్రారంభింపచేశారు. రూ.95.72 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, ఇంటింటి కుళాయి కనెక్షన్లను ప్రారంభించి, తాగునీటిని విడుదల చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజల సొంతింటి కలను నేరవేర్చడం, ఆరోగ్య భద్రత కల్పించడం, పేదపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకడుగు వేయలేదన్నారు. గత ఎన్నికల ఫలితాల్లో మెజార్టీ వచ్చినా, రాకపోయినా తేడాలు చూడకుండా అన్ని గ్రామాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. 1999 నుంచి చంద్రబాబునాయుడు ప్రకటిస్తున్న మేనిఫెస్టోలోని అంశాలను కేవలం 10 శాతం కూడా నెరవేర్చని జిత్తుల మారి నక్క చంద్రబాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు తమ పార్టీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, గుడివాడ నియోజకవర్గానికి తాను మంచి చేశామని నమ్మితే ఓట్లు వేయండి అని మీ ముందుకు వస్తున్న తమకు మద్దతుగా ఉండాలని ఎమ్మెల్యే నాని కోరారు. ప్రజలందరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి రాష్ట్రానికి పట్టిన చంద్రముఖిల పీడలను శాశ్వతంగా అంతమొందించాలని ఎమ్మెల్యే కొడాలి నాని ప్రజలకు సూచించారు. గ్రామంలో కొన్ని సమస్యలు ఉన్నాయని తన దృష్టికి తీసుకువచ్చారని, త్వరలోనే ఆ సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రామ్‌ప్రసాద్, మండలి హనుమంతరావు, వల్లూరిపల్లి సుధాకర్, పొట్లూరి మురళీధర్, గద్దే రాము, యార్లగడ్డ సత్యభూషణ్, గుత్తా నాని, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టాజాన్‌విక్టర్, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మేకల సత్యనారాయణ, ఎంపీడీవో జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ కారే జోసఫ్, గంటా సురేష్, ఆర్‌కే, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే కైలే పుట్టినరోజు వేడుక

పేదలకు అన్నదానం



పామర్రులో కేక్‌ను కట్‌చేస్తున్న ఎమ్మెల్యే మాతృమూర్తి కైలే జ్ఞానమణి, పార్టీ నాయకులు

పామర్రు: స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పామర్రు నాలుగురోడ్ల కూడలి వద్ద భారీ కేక్‌ను పార్టీ నాయకులు, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి కట్‌చేసి శుభాకాంక్షలను తెలిపారు. టౌన్, మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదానం చేశారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కే స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు టీ శ్రీనివాసరావు, మహేష్, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాధ్‌రెడ్డి, పార్టీ ఎస్సీ నాయకులు మద్దుల సుబ్రమణ్యం, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, వార్డు మెంబర్లు ఏ శ్రీహరి, కూసం సుబ్బారెడ్డి, పార్టీనాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, చిన్నం శ్రీనివాసరావు, డీడీ ప్రసాద్, ఏ శ్రీహరి, పీ రాజు, ఎన్‌సింహాచలం, ఏఎంసీ డైరెక్టర్లు కూసం పెద వెంకటరెడ్డి, సజ్జా సుబ్రమణ్యం, ఎస్.సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు తోట్లవల్లూరులో మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటే శ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, సర్పంచ్‌లు శీలం రమేష్, పెనమకూరు నరశింహశర్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు పడమట హరిప్రసాద్, నాయకులు మద్రెడ్డి శేషిరెడ్డి, మోర్ల పూర్ణప్రసాద్, షేక్ లతీఫ్, కిలారం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, నాయకులు తాడిశెట్టి శ్రీనివాసరావు, దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, కూసం పెద వెంకటరెడ్డి, ఎస్.సాంబిరెడ్డి, ఆరుమళ్ల శివారెడ్డి, దొంతు శశి, కె. చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

పెదపూడి(మొవ్వ): పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం మండలంలోని పెదపూడిలోని సత్య సాయి కాంప్లెక్స్‌లో కైలే అనిల్ యూత్ ఘనంగా నిర్వహించారు. అయ్యంకి గ్రామ సర్పంచ్ నాగనబోయిన సునీల్, కైల రమేష్‌బాబు, కాటూరి శ్రీకాంత్, గోరుముచ్చు రాజేష్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదగా కేక్ కటింగ్ నిర్వహించారు. యాత్ర–2 సినిమాను ప్రదర్శించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈఓ తాహెరా సుల్తానా



మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

గుడివాడ టౌన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా అన్నారు. మంగళవారం స్థానిక ఫాదర్ బియాంకి హైస్కూల్‌లో డివిజన్ స్థాయి ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి స్కూల్ హెచ్‌ఎంతో మాట్లాడారు. ఉత్తీర్ణత సాధించడానికి చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వీస్ చేస్తున్నామనే పదాన్ని ఉపాధ్యాయులు వాడొద్దని, జీతానికి తగిన విధంగా పనిచేసుకుపోతే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకోవాలని, నూరు శాతం సాధనకు పాటుపడాల్సిందేనన్నారు. విద్యార్థుల పట్ల హెచ్‌ఎంలు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి షేక్ జానీ సాహెబ్, ఎంఈవోలు విజయ్, బాలాజీ, నందివాడ, ఉంగుటూరు, గుడ్లవల్లేరు, బాపులపాడు, గన్నవరం, పెదపారుపూడి మండల ఎంఈవోలు, ఏఎంఓ శ్యామ్, జిల్లా కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## గోవిందరాజులకు నాయకుల నివాళి



గోవిందరాజులు భౌతిక కాయానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: మండలంలోని బొమ్మినంపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కరేటి గోవిందరాజులు భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ నేతలు మంగళవారం సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)తో పాటు ఆయన తనయులు వినయ్‌కుమార్, శ్యాంఫణికుమార్ తదితరులు గోవిందరాజులు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవిందరాజులు పార్టీకి ఎనలేని సేవలు చేశారని ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, నున్న రాంబాబు, గోరింకల గంగరాజు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. గోవిందరాజులు సోమవారం హఠాన్మరణం చెందారు.

## పాడి రైతులకు అవగాహన సదస్సు



పమిడిముక్కల: మండలంలోని గుర్రాల్లంక పశు వైద్యశాల ఆవరణలో అమూల్ పాలసేకరణ కేంద్రం వద్ద మంగళవారం జగనన్న పాలవెల్లువపై పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మేలుజాతి పశువుల పెంపకం ద్వారా అధిక పాలదిగుబడి పొందాలన్నారు. సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దివ్య మాట్లాడుతూ 10 రోజులు క్రమం తప్పకుండా పాలుపోస్తే మెయింటెన్స్‌కు రూ.40 వేలు రుణం ఇస్తారని, పాడిగేదె కొనుగోలుకు కూడా కేడీసీసీ నుంచి రుణం ఇస్తారని తెలిపారు. అమూల్‌కు, మిగతా వాటికి తేడాను గమనించాలని, ప్రతి ఒక్కరూ ఒక అరలీటరైన పాలుపోయాలన్నారు. 90 రోజుల పాటు పాలుపోస్తే సంఘం రిజిస్ట్రేషన్ అవుతుందని, సంఘానికి వచ్చే లాభాలను సభ్యులకే బోనస్‌గా ఇస్తామన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌పై పాల ఉత్పత్తిదారులకు అవగాహన కల్పించారు. కపిలేశ్వరపురం పశువైద్యులు వెంకటేష్ మాట్లాడుతూ అమూల్ సంస మంచి ధర ఇస్తుందని, వెన్నశాతం బాగానే పడుతుందని పాల ఉత్పత్తిదారులు బొల్లా ధనలక్ష్మి, మురాల వీరమ్మ తెలిపారు. సబ్సిడీపై పాడిగెదెలు, దాణా, మిక్సర్ అందించాలని పాల ఉత్పత్తిదారులు కోరారు. ఏపీఎం దాసరి శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి సుధాకర్, డిజిటల్ అసిస్టెంట్ తిరుమల, యానిమేటర్ భవాని, పాడి రైతులు , తదితరులు పాల్గొన్నారు.

# ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

- ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్
- కైకలూరులో నాలుగో విడత ఆసరా నమూనా చెక్కు పంపిణీ



డ్వాక్రా మహిళలకు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కై కలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని, మడమ తిప్పని నైజానికి నిదర్శనం నాలుగో విడత ఆసరా నగదు జమ అని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో నాలుగో విడత ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమం ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కైకలూరు మండలంలో 1,391 డ్వాక్రా గ్రూపుల్లో 14,173 మంది సభ్యుల ఖాతాలకు నాలుగో విడత రూ.11,24,88,364 నగదు జమ చేశారన్నారు. నియోజకవర్గ నాలుగు మండలాల్లో ఇప్పటి వరకు 5,181 సంఘాలల్లోని 56,684 మంది సభ్యులకు రూ.186,74,23,000 రుణాలను మాఫీ చేయడానికి ప్రభుత్వం నగదు జమ చేసిందని తెలిపారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి నాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలు క్షీరాభిషేకం చేశారు. సభకు వచ్చిన మహిళలకు భోజన సౌకర్యం కల్పించారు. డీఎన్నార్ కుమారులు వినయ్, శ్యామ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీరరాజు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొడ్డు నోబుల్, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి మహమ్మద్ జహీర్, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర, జిల్లా నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

**తాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే**

కైకలూరు: తాగునీటి పైపులైను పనులు పూర్తవడంతో దశాబ్దాలుగా ఆనందరావుపేట ప్రజల కల సాకారమైందని, కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాను ప్రారంభించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఆచవరం పంచాయతీ పరిధి ఆనందరావుపేటలో రూ.10 లక్షలు జల్‌జీవన్ మిషన్, రూ.8 లక్షలు మండల పరిషత్ నిధులతో పైపులైను పనులు పూర్తవడంతో ఎమ్మెల్యే డీఎన్నార్ తాగునీటి సరఫరాను మంగళవారం ప్రారంభించారు. రూ.3 లక్షల నిధులతో చేపట్టిన స్థానిక పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్షతో పేదలకు మేలు



రొయ్యూరులో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మాధవి



వలివర్తిపాడులో వైద్య సలహాలు ఇస్తున్న డాక్టర్, పక్కన విక్టర్ తదితరులు

తోట్లవల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవి అన్నారు. మండలంలోని రొయ్యూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రణవ్ రాఘవ్ 436 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. బీపీ, షుగర్, కళ్లు, ఈసీజీ, రక్త పరీక్షలు చేశారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఏడుకొండలు కంటి పరీక్షలు జరిపారు. శిబిరాన్ని సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్ పరిశీలించారు. కార్యదర్శి అంజనాదేవి, ఎంపీహెచ్ఎస్ అనిల్‌కుమార్, హెచ్‌వీ రోహిణి, ఆరోగ్య కార్యకర్త విజయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడరూరల్: పేదవర్గాలకు కార్పొరేట్‌స్థాయిలో వైద్య సేవలు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని మంగళవారం విక్టర్ ప్రారంభించారు. మండల పీహెచ్‌సీ వైద్యాధికారిణి దీప్తి మాట్లాడుతూ 450 మందికి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ కలపాల కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ శాయన నాగబాబు, మాజీ ఉప సర్పంచ్ కందవల్లి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి అనూల, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

# విశ్వసనీయతకు మారు పేరు వైఎస్సార్ సీపీ

- ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్
- పెడసనగల్లులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

పెడసనగల్లు(మొవ్వ): అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ విశ్వసనీయతకు మారు పేరుగా నిలిచిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని పెడసనగల్లు గ్రామంలో న్యూకాలనీ, ఎస్సీ కాలనీల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో తెలియజేశారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చిన ప్రతి సమస్యకు తక్షణ పరిష్కార దిశగా అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతిహామీని అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కైలే అనిల్ దృష్టికి ప్రజలు అంతర్గత రహదారులు, డ్రెయినేజీ సౌకర్యం, వీధి లైట్లు కావాలని కోరారు. ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, సర్పంచ్ కైతేపల్లి అన్నామణి, పార్టీ మండలాధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, ఉప సర్పంచ్ పామర్తి గోపాల్, నాయకులు పేరం ఉపేంద్ర, కొండేటి ప్రభు, అయ్యంకి శ్రావణి, గృహసారథులు, నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లక్ష్యం నిర్దేశించుకుని చదవాలి



ఇంజిన్ కట్ సెక్షన్ ధ్రువపత్రాన్ని అందిస్తున్న రాజేష్ మిట్టల్

గుడ్లవల్లేరు: లక్ష్యం నిర్దేశించుకుని చదువుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యాన్ని విడవరాదని జపాన్ బహుళ జాతీయ సంస్థ ఇసుజు ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్ అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా మంగళవారం గుడ్లవల్లేరు ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో మెకానికల్ ల్యాబ్ నిర్వహణకు ఇసుజు సంస్థ ఇంజిన్ కట్ సెక్షన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనోత్తేజంతో లక్ష్యం కోసం ప్రయత్నిస్తూనే ఉండాలని రాజేష్ మిట్టల్ పేర్కొన్నారు. శారీరకంగా, మానసికంగా ప్రతి విద్యార్థి తనను తాను కొత్తగా నిర్మించుకోవాలని సూచించారు. ఇసుజు ఇంటర్నల్ కంట్రోలర్ మేనేజర్ కుమార్ శుక్ల, టెక్నో అఫైర్స్ అండ్ పబ్లిక్ రిలేషన్ మేనేజర్ పి.మురళి, డెప్యూటీ మేనేజర్ హెచ్.ఆర్.ఎస్.నరేష్, కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, మెంటార్ ఎస్.ఎస్.ఎస్.వి.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ ఎం.రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారులు సమయ పాలన పాటించండి



మాట్లాడుతున్న ఎంపీపీ కొండేటి ఇందిర

మొవ్వ: సర్వసభ్య సమావేశంలో సమీక్షించిన ప్రతి అంశాన్ని అధికారులు పరిష్కరించాలని ఎంపీపీ కొండేటి ఇందిర సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు సమయపాలన పాటించక పోవటం, మండల స్థాయి అధికారులు హాజరు కాకుండా సబార్డినేట్స్ హాజరవ్వటంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా మిల్లర్ల అజమాయిషీ సాగుతుందని, అధికారులు రైతులకు న్యాయం చేయటంలో విఫలమవుతున్నారంటూ వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు, సర్పంచ్‌లు నాగనబోయిన సునీల్, పంది కృష్ణ, వేములమడ సీతారామయ్యలు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ జీ గోపాలరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ ఎస్ఐ గరగారావును అభినందిస్తున్న ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంటిబాబు

గుడివాడరూరల్: పట్టణంలో ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని గుడివాడ ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పేర్కొన్నారు. నూతన ట్రాఫిక్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన గరగారావును ది గుడివాడ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో డ్రైవర్లు అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఆటోలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులకు ఆటో డ్రైవర్లు సహకరించాలని, ఆటో డ్రైవర్లకు కూడా తాము సహకారం అందిస్తామని ఎస్ఐ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అంగడాల సతీష్, ఆటో యూనియన్ నాయకులు వంగలపాటి బాలస్వామి, కోటేశ్వరరావు, రామ్మోహన్, జాన్‌బాబు, బెంజిమెన్, శ్యాంబాబులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్(నందివాడ): వాహనం నడిపేవారికి అన్ని విధాల అనుమతులు ఉండాలని నందివాడ ఎస్ఐ ఎన్. చంటిబాబు అన్నారు. మంగళవారం నందివాడ మండలం పోలుకొండ గ్రామంలో వాహనాల తనిఖీ అనంతరం లైసెన్సులు లేని వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజంలో రకరకాల వాహనాలు అందుబాటులోకి వచ్చాయని, వాటిని నడిపే వారికి కచ్చితంగా అన్ని అనుమతులు ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన ఇతర వివరాలు వాహనంతో పాటు ఉంచాలని, లేనిపక్షంలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.